గణనాథుని సన్నిధిలో ఎమ్మెల్యే



ఆలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

పటాన్‌చెరు: శ్రావణమాసంను పురస్కరించుకొని గణేష్‌గడ్డ సిద్ధి వినాయకుని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు.అనంతరం ఆలయ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులపై స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, ఆలయ మాజీ ధర్మకర్తలు, ఈఓ లావణ్యతో సమీక్ష నిర్వహించారు. నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు గ్రామ మాజీ సర్పంచ్‌ సుధీర్‌రెడ్డి, రుద్రారం పిఏసిఎస్‌ ఛైర్మన్‌ పాండు, సీనియర్‌ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తా...



ఆదిత్యనగర్‌ కాలనీలో డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధిలోని ఆదిత్యనగర్‌ కాలనీలో భారీ వర్షాలకు డ్రైనేజీ పొంగి నీరు రోడ్లపై నిల్వ ఉంటోందని కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు వాటర్‌వర్క్స్‌ సిబ్బందితో కలిసి కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య పరిష్కరిస్తానన్నారు. డివిజన్‌లో పెండింగ్‌ పనులను త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్‌ మేనేజర్‌ ప్రియాంక, సూపర్‌వైజర్‌ నరేంద్ర, డివిజన్‌ నాయకులు పాల్గొన్నారు.

రుద్రాభిషేకం



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌, దత్తాత్రేయ కాలనీలో సోమవారం నాగలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. బీఆర్‌యస్‌ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్‌ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగభూషణం, శ్రీనివాస్‌, యాదగిరి, దేవేందర్‌, రామకృష్ణ, నాగార్జున, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

మణికొండ: దేవాలయాలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరుస్తుందని తద్వారా మానసిక ప్రశాంతత, ఉత్తేజం కలుగుతాయని మణికొండ మున్సిపాలిటీ మాజీ వైస్‌ చైర్మన్‌ కె. నరేందర్‌రెడ్డి అన్నారు. చిత్రపురి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి సోమవారం గడప ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికతను అలవర్చుకుని మనశ్శాంతితో జీవించాలన్నారు. నిత్యం దేవాలయాన్ని దర్శించుకుంటే నూతన ఉత్తేజంతో జీవించవచ్చన్నారు. బీజేపీ మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శివరాంరెడ్డి, నాయకులు జె.సిద్దప్ప, సి.బీరప్ప, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మార్కెట్లలో మెరుగైన వసతులు కల్పిస్తాం



మణికొండ: నార్సింగి మార్కెట్‌ కమిటీ పరిధిలోని మార్కెట్‌లలో రైతులు, పశు వ్యాపారులకు మెరుగైన వసతులను కల్పిస్తామని మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ కె.వేణుగౌడ్‌ అన్నారు. సోమవారం మార్కెట్‌ కమిటీ పరిధిలోని బబ్బుగూడలో బోరు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్‌ మాట్లాడుతూ... మార్కెట్‌ కమిటీకి బబ్బుగూడ నుంచి మంచి ఆదాయం వస్తున్నదని, గతంలో అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించాలని వ్యాపారులు కోరటంతో ఆ దిశగా పనులు చేపట్టామన్నారు. రాబోయే రోజుల్లో వారికి షెడ్లు, ఇతర సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ డైరెక్టర్లు బాల్‌రెడ్డి, లక్ష్మిశ్రీ, సాదిక్‌, వ్యాపారులు పాల్గొన్నారు.

ముష్కి చెరువు.. ఉద్యోగులూ దృష్టి పెట్టండి

రాయదుర్గం: టీఎన్‌జీఓ కాలనీలోని ముష్కి చెరువు అభివృద్ధికి నోచడం లేదు. నగరంలో చెరువులను అభివృద్ధి చేస్తున్న క్రమంలో ప్రభుత్వ ఉద్యోగులు ఉండే కాలనీలో చెరువు సుందరీకరణకు నోచుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కాగా గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓ కాలనీ, రంగారెడ్డిజిల్లా టీఎన్‌జీఓ కాలనీ, సెక్రటేరియట్‌ కాలనీలన్నింటికీ దగ్గరగా ఉన్న చెరువు ఇదే. అంతేకాకుండా పరిసరాల్లో పలు అపార్ట్‌మెంట్లు, గేటెడ్‌ కమ్యూనిటీలు కొనసాగుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించక పోవడం ఆశ్చర్యం. ఈ చెరువు పరిసరాల్లో నివసించేది మొత్తం ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్‌ ఉద్యోగులు ఉంటున్నారు. ఈ చెరువును సుందరీకరిస్తే భూగర్భ జలాలు పెరగడమేకాకుండా స్థానికులు సేద తీరే అవకాశం కలుగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని కాలనీలవాసులు కోరుతున్నారు.

- మూడేళ్ల క్రితం టీఎన్‌జీఓ కాలనీ రంగారెడ్డిజిల్లా ప్రాంతం కాలనీ అధ్యక్షుడు జంగయ్య జీహెచ్‌ఎంసీ అప్పటి డిప్యూటీ కమిషనర్‌ వెంకన్నను కలువగా ఆయన చొరవ తీసుకోవడంతో చెరువు కట్టను చదును చేశారు.

టీఎన్‌జీఓ కాలనీలో నివాసముండేవారంతా సర్కారీ కొలువు చేసేవారే..





టీఎన్‌జీఓ కాలనీలోని ముష్కి చెరువు, చెరువు కట్ట ప్రాంతం

- సుందరీకరించాలని సంకల్పించినా డీసీ బదిలీపై వెళ్ళడంతో ఆదశలోనే ఆగిపోయింది
- వర్షాకాలంలో భారీ వర్షాలు కురిస్తే చెరువు నిండితే దగ్గరలోని ప్రధాన రోడ్డుపైకి నీరు చేరుతుంది
- చెరువు నిండినప్పుడు అలుగు ద్వారా చాలా వరకు నీరు నాలాలో కలవడంతో పాటు నానక్‌రాంగూడ చెరువు వైపు పారుతుంటాయి.
- కాగా చెరువు సుందరీకరణకు నిధులు మంజూరు చేయాలి. చెరువులోని వ్యర్థాలు, చుట్టూ ఉండే చెత్తను తొలగించాలి.

చెరువును సుందరీకరించాలి



టీఎన్‌జీఓ కాలనీలోని ముష్కి చెరువును సుందరీకరించాలి. చెరువు కట్టను మరింత పటిష్టం చేయాలి. చెరువు చుట్టూ వాకింగ్‌ ట్రాక్‌ ఏర్పాటు చేస్తే కాలనీవాసులకు వాకింగ్‌ చేయడానికి అవకాశం ఉంటుంది. కాలనీలో విశ్రాంత ఉద్యోగులు చాలా మంది ఉన్నారు. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు చేపట్టాలి.

–జంగయ్య, టీఎన్‌జీఓ కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌, రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు

ప్రతి డివిజన్‌లో 'హర్‌ ఘర్‌ తిరంగా యాత్ర' నిర్వహించాలి



సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్‌

బీజేపీ రంగారెడ్డి అర్బన్‌ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి

గచ్చిబౌలి: ప్రతి డివిజన్‌లో 'హర్‌ ఘర్‌ తిరంగా యాత్ర' నిర్వహించాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్‌ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని మసీదుబండ బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన హర్‌ ఘర్‌ తిరంగా యాత్ర కార్యశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఆవిష్కరణ జరిగేలా చూడాలన్నారు. ఆగస్టు 10 నుంచి 15వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. తాను స్వయంగా కూడా పతాకాన్ని ఎగుర వేస్తా నన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో భారతదేశంపై గౌరవం మరింత పెరిగేలా చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్‌, పార్టీ నాయకులు రాఘవేంద్రరావు, మణిభూషణ్‌, నాగులుగౌడ్‌, ఎల్లేష్‌, రాధాకృష్ణయాదవ్‌, రామరాజు, కేశవులు, స్రవంతి, ఆంజనేయులు, అరవింద్‌, లక్ష్మణ్‌, గణేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌ ఎల్లమ్మబండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులను సోమవారం డివిజన్‌ కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పిల్లలు అపరిశుభ్రమైన ప్రదేశాల్లో ఆటలు ఆడటం, మల విసర్జన ద్వారా నులి పురుగులు వ్యాపించే అవకాశాలున్నాయని తెలిపారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, పోశెట్టిగౌడ్‌, గుడ్ల శ్రీనివాస్‌, డాక్టర్‌లు డి. మౌనిక, సుజిలీల, కృష్ణవేణి, సంతోషి, రాజ్యలక్ష్మి, శశిరేఖ, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు నులిపురుగుల మందు వేస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌, వైద్యులు

వలస కూలీ ఆత్మహత్య

క్రైం కార్నర్‌..

గచ్చిబౌలి: మానసిక రుగ్మతతో బాధపడుతూ ఓ వలస కూలీ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యప్రదేశ్‌, దేవిరికాపకు చెందిన రాంప్రసాద్‌(28) ఈ నెల 6న గచ్చిబౌలికి వచ్చాడు. సంధ్య కన్వెన్షన్‌ గోడౌన్‌లో ఉంటూ కూలి పనులు చేస్తున్నాడు. వరుసకు సోదరుడైన రమేష్‌ మేరావి ఆదివారం సాయంత్రం 5 గంటలకు లింగంపల్లి కూరగాయల మార్కెట్‌కు వెళ్లగా రాంప్రసాద్‌ గోడౌన్‌లోనే ఉన్నాడు. ఈ క్రమంలో సీలింగ్‌ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉండటాన్ని గమనించి అతను పోలీసులకు సమాచారం అందించాడు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారి హత్య కేసులో నలుగురు నిందితులు అరెస్ట్‌

మియాపూర్‌ : తన వ్యాపారం సరిగా జరగడం లేదనే అక్కసుతో పక్క వ్యాపారి గొంతుకోసి హత్య చేసిన ఘటనలో నలుగురు నిందితులను మియాపూర్‌ పోలీసులు అరెస్ట్‌ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. మాదాపూర్‌ డీసీపీ వినీత్‌, మియాపూర్‌ సీఐ శివప్రసాద్‌ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌ హఫీజ్‌పేట్‌కు చెందిన ఎస్‌కే. మొహీజ్‌40) హఫీజ్‌పేట్‌ రైల్వేస్టేషన్‌ సమీపంలో మంజీరా రోడ్డు పక్కన కట్టెల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇతని దుకాణానికి కొంతదూరంలో వనపర్తి జిల్లా పెద్దమందాది మండలం జంగమయ్యపల్లికి చెందిన బుల్లెద్దుల శ్రీనివాస్‌(40) కట్టెల వ్యాపారం చేస్తున్నాడు. కొంతకాలంగా శ్రీనివాస్‌ వ్యాపారం బాగా జరుగుతుండడంతో మొహీజ్‌ కక్ష పెంచుకుని శ్రీనివాస్‌తో పలుమార్లు గొడవ పడ్డాడు. ఈ క్రమంలో ఆదివారం 11 గంటల సమయంలో మొహీజ్‌ తన అల్లుడు సాహిల్‌(17)తో కలిసి శ్రీనివాస్‌తో గొడవపడ్డారు. తర్వాత శ్రీనివాస్‌ మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో మొహీజ్‌ కట్టెల దుకాణం ముందునుండి ఇంటికి వెళ్తుండగా మొహీజ్‌ వెనుక నుండి వెళ్లి శ్రీనివాస్‌ మెడను గట్టిగా పట్టుకున్నాడు. మొహీజ్‌ దుకాణంలో పనిచేస్తున్న మక్బుల్‌(40), అన్వర్‌ కూడా శ్రీనివాస్‌ను గట్టిగా పట్టుకున్నారు. సాహిల్‌ కత్తితో శ్రీనివాస్‌ కడుపులో పొడవడంతో పాటు గొంతుకోశాడు. తీవ్ర రక్తస్రావంతో శ్రీనివాస్‌ పడిపోయాడు. అక్కడి నుండి నలుగురు పరారయ్యారు. స్థానికులు చూసి దగ్గర్లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరిశీలించి శ్రీనివాస్‌ మృతి చెందాడని తెలిపారు. పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. శ్రీనివాస్‌ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మియాపూర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ముమ్మరం చేశారు. కాగా సోమవారం సాహిల్‌, మొహీజ్‌, మక్బుల్‌, అన్వర్‌లను మియాపూర్‌ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసింది తామేనని అంగీకరించారు. దీంతో మైనర్‌ అయినా సాహిల్‌ను జువైనల్‌ హోమ్‌కు తరలించగా మొహీజ్‌, మక్బుల్‌, అన్వర్‌లను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. శ్రీనివాస్‌ భార్య సోనిలా, ఇద్దరు పిల్లలు స్వంత గ్రామంలో ఉంటుండగా శ్రీనివాస్‌ రాధ అనే మహిళను మరో వివాహం చేసుకుని హఫీజ్‌పేటలో ఉంటున్నాడు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూ నాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన డ్రైవ్‌లో 11 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 10 మందికి ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా, మరొకరికి రూ. 1500 జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

రాయదుర్గం: వైభవలక్ష్మీ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు భరత్‌కుమార్‌గౌడ్‌ తెలిపారు. సోమవారం రాయదుర్గంలోని వైభవలక్ష్మీ అమ్మవారి ఆలయంలో కమిటీ సభ్యులు కృష్ణగౌడ, సతీష్‌గౌడ్‌,శ్రీరామ్‌గౌడ్‌ పర్యవేక్షణలో అర్చకులు ఉదయం 6 గంటలకు గణపతి పూజ, పుణ్యాహవచనం, ప్రథమ కలశపూజ, ఉదయం 8 గంటలకు వైభవలక్ష్మీ శాంతి హోమం, 10 గంటలకు నవ కలశస్థాపన అభిషేకం, 11.30గంటలకు లక్ష్మీనారాయణ కల్యాణం, శ్రీనివాస కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

శంకుస్థాపనలు

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో మంగళవారం రూ.5.42 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేయనున్నారు. డివిజన్‌ పరిధిలోని గుల్‌మొహర్‌పార్కు కాలనీ, లక్ష్మీ విహార్‌, నల్లగండ్ల హుడా కాలనీ, గోపన్‌పల్లి, టీఎన్‌జీఓ కాలనీ, ఖాజాగూడలలో సీసీరోడ్లు, నానక్‌రాంగూడ, రాయదుర్గంలో వరదనీటి కాలువ పనులకు శంకుస్థాపన చేస్తారు.

లక్ష్మీగణపతి హోమం

ఆల్విన్‌కాలనీ: సంకష్ట చతుర్థిని పురస్కరించుకొని మంగళవారం ఆల్విన్‌కాలనీ ఫేజ్‌ -2లో భ్రమరాంబ మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో సాయంత్రం 4.30 గంటలకు లక్ష్మీ గణపతి హోమం నిర్వహించనున్నారు. శక్తి గణపతికి పంచామృతాభిషేకాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వెంకట నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జర్నలిస్ట్‌ కాలనీ, ఫైర్‌ స్టేషన్‌, 60 గజాలు , గౌలిదొడ్డి గవర్నమెంట్‌ స్కూల్‌ తదితర ప్రాంతాలలో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజావాణి..12 ఫిర్యాదులు

చందానగర్‌ : చందానగర్‌ సర్కిల్‌- 21 కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 12 ఫిర్యాదులు వచ్చాయని ఉప కమిషనర్‌ శశిరేఖ తెలిపారు. టౌన్‌ ప్లానింగ్‌ 5, శానిటేషన్‌ 1, యూసీడీ 1, ఇంజనీరింగ్‌ విభాగానికి 4 , ఇతర సెక్షన్‌లలో 1 ఫిర్యాదు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, ఇంజనీరింగ్‌ డీఈ దుర్గాప్రసాద్‌, శ్రీదేవి, శానిటేషన్‌ సూపర్‌వైజర్‌ శ్రీనివాస్‌, యూబీడీ అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు వింటున్న డీసీ

విశ్వకర్మ మన్మయ సంఘం ధర్నా



డోయన్స్‌ కాలనీలో ధర్నా చేస్తున్న విశ్వకర్మ సంఘం ప్రతినిధులు

శేరిలింగంపల్లి: విశ్వకర్మ మన్మయ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి డోయన్స్‌ కాలనీలోని కస్టమ్‌ ఫర్నిష్‌.కామ్‌ ముందు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సుంకోజు కృష్ణమాచారి మాట్లాడుతూ విశ్వకర్మల మనోభావాలు దెబ్బతీసేవిధంగా కస్టమ్‌ ఫరిష్‌.కామ్‌ సంస్థ యూట్యూబ్‌లో వీడియోలు రిలీజ్‌ చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కార్పెంటర్స్‌కు నూతన విజనరీ వ్యవస్థ లేదని, పలు ప్రాంతాల్లో పనులు ఒప్పుకొని సకాలంలో ఇవ్వరని, క్రెడిబిలిటీ లేదని విమర్శిస్తూ 50 వరకు వీడియోలు రిలీజ్‌ చేశారని, తమ సంఘంలో పనిచేస్తున్న వేలాది మంది విశ్వకర్మలు రోడ్డున పడే విధంగా చేసిన ఈ సంస్థపై కఠిన చర్యలు తీసుకునే వరకు తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా సదరు సంస్థ విశ్వకర్మలకు క్షమాపణ చెప్పడంతో పాటు వీడియోలను వెంటనే తొలగించాలని డిమాండ్‌ చేశారు .కార్యక్రమంలో మాతృ సంఘం ఉపాధ్యక్షులు నారోజు జగ్జీవన్‌, ప్రధాన కార్యదర్శి శ్రీరాములుచారి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వెంకటాచారి, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు పరిపూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

నాలాల విస్తరణ, వరదనీటి కాలువల నిర్మాణానికి ప్రాధాన్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌

ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి/శేరిలింగంపల్లి: వరదనీటి సమస్య తీర్చేందుకే నాలాల విస్తరణ, వరదనీటి కాలువల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. సోమవారం కొండాపూర్‌ డివిజన్‌లో రూ.7.27 కోట్లతో, శేరిలింగంపల్లి డివిజన్‌ లో రూ.15.83 కోట్లతో సీసీరోడ్లు, వరదనీటి కాలువల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలు ,బస్తీలలో అంతర్గత రోడ్లను దశలవారీగా సీసీరోడ్లుగా మారుస్తున్నామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్‌ హమీద్‌పటేల్‌, రాగం నాగేందర్‌యాదవ్‌, కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్ల ప్రతినిధులు, కాలనీ వాసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

చెరువులను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దాలి

మణికొండ: చెరువులతోనే జీవవైవిధ్యం మెరుగుపడుతుందని, వాటిని పరిరక్షించుకుంటూ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట కొత్త చెరువు వద్ద నార్సింగి మున్సిపాలిటీ తరఫున నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జెమినీ ఎడిబుల్స్‌, ఫాట్స్‌ ఇండియా లిమిటెడ్‌ (జీఈఎఫ్‌ ఇండియా) సంస్థ తమ సీఎస్‌ఆర్‌ నిధులతో కోకాపేట చెరువు అభివృద్ధికి ముందుకు రావటం అభినందనీయమన్నారు. ఆరు నెలలుగా చెరువు వద్ద ధృవాన్ష్‌ ఎన్‌జీఓతో కలిసి చెరువు చుట్టూ ఉన్న ముళ్ల చెట్లను తొలగించటం, కట్ట మరమ్మతు, ప్రవేశ ద్వారాలు, సీసీ కెమెరాలు, సందర్శకులు కూర్చునే ప్రాంతాల అభివృద్ధి, నీటి నాణ్యత పెంచేందుకు వెట్‌ లాండ్‌ల ఏర్పాటు, స్ప్రింక్లర్లతో ఆక్సిజన్‌ శాతం పెంచటం లాంటి పనులను చేపట్టారని ఎమ్మెల్యే వివరించారు. దాంతో చెరువు వద్దకు పక్షుల రాకపోకలు, పర్యావరణ పునరుజ్జీవం పొందుతోందన్నారు. చెరువు చుట్టూ పెద్ద ఎత్తున మొక్కలను నాటి వాకింగ్‌ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తే మరింత మందికి ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ స్పష్టం చేశారు. జీఈఎఫ్‌ ఇండియా వైస్‌ ప్రెసిడెంట్‌ అక్షయ్‌ చౌదరి మాట్లాడుతూ... సమాజానికి మేలు చేయటం, సహజ వనరులను భవిష్యత్‌ తరాలకు అందించటం, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చెరువుల పునరుద్ధరణకు తమ వంతు సహకారం అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో టీఎస్‌ఐజీ డైరెక్టర్‌ అర్చన సురేష్‌, నార్సింగి మున్సిపల్‌ కమిషనర్‌ టి. కృష్ణమోహన్‌రెడ్డి, లేక్‌ ప్రొటెక్షన్‌ సెల్‌ అధికారి కృష్ణారావు, ధృవాన్ష్‌ ప్రతినిధి మధులిక చౌదరి, కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, గుడిమల్కాపూర్‌ మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ టి.మల్లేష్‌ముదిరాజ్‌, కాంగ్రెస్‌ పార్టీ నార్సింగి మున్సిపల్‌ అధ్యక్షుడు కె. అశోక్‌యాదవ్‌, పలువురు మాజీ కౌన్సిలర్‌లు, నాయకులు పాల్గొన్నారు.

శభాష్‌ పోలీస్‌ ..

చందానగర్‌: మియాపూర్‌ ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని న్యూహఫీజ్‌పేట్‌ లేబర్‌ అడ్డా వద్ద ప్రధాన రహదారిపై గుంత ఏర్పడడంతో ట్రాఫిక్‌ సమస్య తలెత్తింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిద్దేశ్వర్‌ నిరంజన్‌ వెంకట్‌ మట్టితో గుంత పూడ్చారు. దీంతో ట్రాఫిక్‌ కానిస్టేబుల్‌ను ప్రజలు, వాహనదారులు అభినందించారు.



నేరం ఇక్కడ.. మకాం స్వరాష్ట్రంలో

- కష్టంగా మారిన గంజాయి నిందితుల పట్టివేత
- అరెస్టైన వారిలో పక్క రాష్ట్రాల వారే 23 మంది
- నిందితులను పట్టుకునేందుకు సహకరించని పోలీసులు

పటాన్‌చెరు టౌన్‌: గంజాయి రవాణా, విక్రయం, వినియోగంపై ఎక్సైజ్‌ శాఖ దృష్టి సారించి అక్రమార్కులపై ఉక్కుపాదం మోపుతోంది. పటాన్‌చెరు ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఈ ఏడాది గంజాయికి సంబంధించి 22 కేసులు నమోదు కాగా అందులో 35 మందిని పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో 23 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారే. పటాన్‌చెరు శివారులోని టోల్‌గేట్‌ మీదుగా గంజాయిని తరలిస్తూ పోలీసులకు చిక్కుతున్నారు. కాగా ఇతర రాష్ట్రాల నుంచి ఓఆర్‌ఆర్‌ మీదుగా తీసుకొస్తున్నారు. ఇందులో ఎక్కువగా పాతనేరస్తులే ఉండటం గమనార్హం.

ఫోన్‌ సిగ్నల్‌ లేని ప్రాంతాలకు వెళ్లడంతో..

గంజాయిని ఎక్కువగా మహారాష్ట్ర, జార్ఖండ్‌, ఛత్తీస్‌గఢ్‌, ఒడిశా, బిహార్‌ రాష్ట్రాలకు చెందిన వారు తరలిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు పటాన్‌చెరు ఎక్సైజ్‌ స్టేషన్‌ పరిధిలో గంజాయి రవాణా కేసుల్లో పట్టుబడిన 30 మందిలో 23 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఉన్నారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా బెయిల్‌ తీసుకుని సొంత రాష్ట్రాలకు వెళ్లి తలదాచుకుంటున్నారు. నిందితుల కోసం వారి రాష్ట్రాలకు వెళ్తే దొరకడం లేదని, కనీసం అక్కడి పోలీస్‌ సిబ్బంది సహకరించకపోవడం విస్మయానికి గురిచేస్తుంది. నిందితులు ఫోన్‌ సిగ్నల్‌ లేని ప్రాంతాలకు వెళ్లడంతో సమాచారం తెలుసుకోవడం కష్టంగా మారింది. అక్కడి పోలీసులకు సమాచారం ఇవ్వకుండా నేరుగా వెళ్లి వెతికితే ఇటీవలే ఐదుగురు నిందితులు పట్టుబడ్డారని పటాన్‌చెరు పోలీసులు పేర్కొన్నారు.



మహారాష్ట్రలో నిందితులను పట్టుకున్న ఎక్సైజ్‌ సీఐ, సిబ్బంది

సహకరించడం లేదు



గంజాయి కేసులో అరెస్టు అవగానే బెయిల్‌ తీసుకుని స్వరాష్ట్రాలకు వెళ్లి తలదాచుకుంటున్నారు. దర్యాప్తులో భాగంగా వారిని పట్టుకోవడానికి అక్కడికి వెళితే ఆ ప్రాంత పోలీసులు మాకు సహకరించడం లేదు. చెప్పకుండా వెళ్లి దర్యాప్తు చేసి ఇటీవలే ఐదుగురిని పట్టుకొచ్చాం.

– పరమేశ్వర్‌ గౌడ్‌, ఎక్సైజ్‌ సీఐ